www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 3 జనవరి 2023 5 కాకినాడ



సత్యదేవునికి ముక్కోటి ఏకాదశి ఆదాయం రూ.36 లక్షలు

ప్రజాశక్తి - అన్నవరం

ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని అన్నవరం సత్యదేవునికి ఒక రోజులోనే వివిధ సేవా టికెట్లు, ఇతర విభాగణ ద్వారా 30 లక్షలు ఆదాయం లభించినట్లు ఇఒ ఎన్‌విఎస్ మూర్తి తెలిపారు. ముక్కోటి ఏకాదశి పర్వదిన కావడంతో రత్నగిరి నీ ప్రత్యేకంగా అలంకరించారు స్వామి అమ్మవారిని ప్రధాన ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం వైపు ప్రత్యేక ఉంచారు అనంతరం వేకువ జామున 5 గంటల నుండి 12 గంటల వరకు భక్తులకు ప్రత్యేకంగా ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. పిల్లలకు, వృద్ధులకు పాలు పంపిణీ చేశారు. దేవస్థానం ఇఒ మూర్తి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. వివిధ కళాకారులు తో నిర్వహించిన కోలాటకాలు అలరించాయి. రాత్రి స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు.



సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ సామర్లకోట స్టేషన్ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ నాయకులు

యుటిఎఫ్ 2కె వాక్

- సిపిఎస్ ను రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - సామర్లకోట

సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ సోమవారం సాయంత్రం స్థానిక ప్రసన్నాంజనేయ బొమ్మ వద్దనుండి స్టేషన్ సెంటర్ వరకు 2కే వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటకూర రవి చక్రవర్తి మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల లో ఇచ్చిన రవి ప్రకారం సి పి ఎస్ ను రద్దుచేసి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. సిపిఎస్ రద్దు చేసేంతవరకు యూటీఎఫ్ పోరాటాలను కొనసాగిస్తుందని అన్నారు. కాకినాడ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీ అన్నా రాము, యుటిఎఫ్ కాకినాడ జిల్లా పత్రిక బాధ్యులు పి గిరిధర్ గోపాల రావు, పట్టణ శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎస్ రాజా, కే శ్రీనివాసు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ శ్రీనివాస్, కే ప్రభాకర్ సీనియర్ నాయకులు కేఎంఆర్ ప్రసాదు, ఓ నాగేశ్వరరావు, ఎం నాగేశ్వరరావు, సయ్యద్ సైపుల్ల, కే జగదీశ్వర రావు, పద్మావతి, గోపాలకష్ణ, కెవివి సత్యనారాయణ పి రమణబాబు, ఆనంద్, ధర్మ, శ్రీలక్ష్మి, లక్ష్మీ దుర్గ, శంకర్, రాంబాబులు పాల్గొన్నారు. **జగ్గంపేట** యుటిఎఫ్ జగ్గంపేట మండల శాఖ గౌరవాధ్యక్షులు పివివి సత్యరాయణ అధ్యక్షతన ఎంప్లాయిస్ కాలనీ నుండి పంచాయతీ కార్యాలయం మీదుగా తిరిగి యుటిఎఫ్ హెూమ్ వరకు 3కె వాక్ ఫర్ ఒపిఎస్ నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి ప్రభాకర్ వర్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సిపిఎస్ జిపిఎస్‌లు కాదు ఓపిఎస్ అమలు చేసి ప్రభుత్వ చిత్తసుద్ధిని నిరూపించు కోవాలని చెప్పారు. కార్యక్ర మంలో యుటిఎఫ్ కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం వి.సాయిరాం, కిర్లంపూడి నుండి జిల్లా కార్యదర్శి నూకరాజు యుటిఎఫ్ జగ్గంపేట మండల శాఖ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి పి.బాలాజీ, సహ అధ్యక్షులు కె.పెద్దబ్బులు, సహా ధ్యక్షురాలు గంగా భవాని కోశాధికారి సూర్యనారాయణ కార్య దర్శులు, విశ్రాంత ఉపాధ్యా యులు తోలేటి సూర్య నారాయణ, మంచాల మల్లేశ్వర రావు,శాస్త్రి 120 మంది ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.



సిపిఎస్ అని రద్దు చేయాలని కోరుతూ జగ్గంపేటలో ఉపాధ్యాయ నాయకుల మానవహారం

మళ్లీ అవే అర్జీలు...

- నాలుగేళ్లు తిరుగుతున్నా న్యాయం జరగలేదంటూ...
- పులిమేరు సొసైటీలో రుణాల పేరుతో మోసం అంటూ ....
- వైసిపి నాయకుల కబ్జాపై మహిళ వినితి
- స్పందనకు 185 అర్జీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

అధికారుల వద్ద సమస్యలు పరిష్కారం కాలేదని స్పందనంలో ఇచ్చిన ఫిర్యాదులకే న్యాయం జరుగలేదంటూ ఒక అర్జీ, రహదారి విస్తరణకు భూమి ఇచ్చినపుడు ఒక రేటు, ఇప్పుడు సగానికి సగం తగ్గించి ధర ఇస్తామంటుండంతో న్యాయం చేయాలంటూ రైతులు, భర్తకు మతిస్థిమితం లేక తన భర్త ఉద్యోగం తన కూతురుకు ఇప్పించమని నాలుగేళ్లుగా తిరుగుతున్న మహిళ, రెండు కోట్ల ఆస్తిపై అధికార పార్టీ నాయకుడు కన్నేసి తమను ఇంటి నుంచి గెంటేశారంటూ ఓమహిళల నుంచి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రాలు వచ్చాయి. దీనిపై తిరిగి అధికారులు ఏం స్పందిస్తారో అని కలెక్టరేట్ ప్రాంగణ వద్ద బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.

కాకినాడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అసిస్టెంట్ కలెక్టరు ప్రఖర్ జైన్, డిఆర్ఒ కె. శ్రీధర్‌రెడ్డి, జడ్‌పి సీఈవో ఎన్‌వివి సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఇడి ఎస్‌విఎస్ సుబ్బలక్ష్మిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌర సరఫరా సేవలు, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు తదితరాలకు సంబంధించి మొత్తం 185 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి నాణ్యమైన, సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పరిష్కార నివేదికకు అర్జీ దారి సమస్య పరిష్కారానికి సంబంధించిన ఫోటోలను తప్పనిసరిగా జత చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు , కలెక్టరేట్ సెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పందనపై విచారణ జరగలేదంటూ తిరిగి స్పందనలో ఫిర్యాదు

పెద్దాపురం మండలం పులిమేరు సొసైటీలో రుణాల పేరుతో రైతులను సొసైటీ అధికారి సత్యానందం, గుమస్తా తాతాజీలు మోసం చేస్తున్నారంటూ గత ఏడాది నవంబర్ 28న స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి విచారణ చేపట్టకపోవడంతో ఈ సోమవారం మరలా స్పందనలో ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదును పెద్దాపురం మండలం సిరివాడ గ్రామానికి చెందిన రైతులు ఇనకొండ వీరవెంకట తమ్మిరాజు, ఇనకొండ వీరగోవింద నూకరాజులు తిరిగి స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులిమేరు సొసైటీలో సభ్య లుగా ఉన్న తాము రుణం తీసుకున్నామని, తిరిగి రుణం చెల్లిద్దామంటే తాము తీసుకున్న రుణానికి, పులిమేరు సొసైటీ అధికారి సత్యానందం చెబుతున్న లెక్కలకు ఏమాత్రం పొంతన లేకుండా ఉందన్నారు. తమకు పూర్తి వివరాలతో తీసుకున్న రుణం దానికి పడ్డ వడ్డీ వివరాలతో ఇమ్మంటే ఇప్పటివరకు ఇవ్వలేదని తెలిపారు. పెద్దాపురం డిసిసిబి బ్యాంకుకు వెళ్లి అడిగినప్పటికీ వాళ్లు కూడా ఏమాత్రం వివరాలు చెప్పలేదని స్పష్టం చేశారు. అయితే నవంబర్ 28న స్పందనలో చేసిన ఫిర్యాదుకు నాలుగు రోజుల తర్వాత తానులేని సమయంలో డీసీసీబీ బ్యాంకు అధికారి, సొసైటీ గుమస్తాలు తమ ఇంటికి వచ్చి బ్యాంకు స్టేట్‌మెంట్ చూపించి తన అన్నగారి చేత సంతకాలు పెట్టించుకుని వెళ్లారన్నారు. అయితే బ్యాంకు వారు చెప్పి నదానికి, సొసైటీ అధికారి సత్యానందం ఇచ్చిన వివరాలకు సంబంధం లేదన్నారు. దీంతో సొసైటీ అధికారి సత్యానందం, బీసీసీబీ బ్యాంక్ అధికారి పైన విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని మరో మారు స్పందనలో కలెక్టర్‌కు అర్జీ దాఖలు చేసినట్లు చెప్పారు. ఇప్పటికైనా న్యాయం జరగకపోతే తాము అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ లోకాయుక్తను ఆశ్రయించ గలమని వారు స్పష్టం చేశారు.



నాలుగేళ్లుగా సాయం అందలేదని కలెక్టర్ తెలుపుతున్న బాధితురాలు



పులిమేరు సొసైటీపై స్పందనలో ఫిర్యాదు చేసిన తమ్మి రాజు

నాలుగేళ్లగా తిరుగుతున్నాం : న్యాయం చేయండి

కలెక్టర్ ముందే డిసిఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధితురాలు

కాకినాడ కార్పొరేషన్‌:నా భర్త నాలుగు సంవత్సరాలుగా మతిస్థిమితం లేకుండా పడి ఉన్నాడని, కుటుంబం గడవడం కష్టంగా ఉందని, నా భర్త ఉద్యోగం నా కుమార్తెకు ఇప్పించే న్యాయం చేయాలంటూ కోపరేటివ్ కార్యాలయాన్ని చుట్టూ తిరు గుతూ ఉన్నానని కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన ముమ్మిడి వీరలక్ష్మి కలెక్టర్కు విన్నవించుకుంది. కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వచ్చిన బాధితురాలు వరలక్ష్మి కలెక్టర్ కృతికా శుక్లాకు అర్జీ ఇచ్చే సమయంలో కోపరేటివ్ సొసైటీ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నా భర్త మతిస్థిమితం లేకుండా పడి ఉండడంతో పోషణకు ఇబ్బందిగా ఉందని, గతంలో స్పందనకు వస్తే జాయింట్ కలెక్టరుకు సమస్యను విన్నవిస్తే తక్షణం చర్యలు తీసుకోవాలని ఈ అధికారులను ఆదేశించారని తెలిపింది. అయినా ఫలితం లేకపోవడంతో మరల వస్తే సొసైటీ అధికారులు పంటలు లేని సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని బాధితురాలికి చెప్పడంతో అక్కడ నుంచి బాధితురాలు వెనుతిరిగింది.



సాగరమాల భూములకు ధర ఇవ్వటం లేదని స్పందనకు వచ్చిన తొండంగి మండల రైతులు

ఇస్తే న్యాయమైన ధర ఇవ్వండి ... లేదా భూమలు ఇచ్చేయండి

న్యాయం చేయాలని కలెక్టర్ రైతులు వినతి

సాగర్ మాల రహదారి వస్తున్నందుకు రైతుల నుంచి తీసుకున్న పొలాలకు సంబంధించి గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని జిల్లా కలెక్టర్ కతకా శుక్లాకు సంబంధిత రైతులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు వచ్చిన తొండంగి మండలం రైతులు కలెక్టర్‌కు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రైతుల దగ్గర వద్ద నుంచి భూమని తీసుకున్నప్పుడు రూ.46 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రూ.29 లక్షల మాత్రమే ఇస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేని పక్షంలో మా భూమలు మాకు ఇచ్చేయాలని రైతుల కోరారు.

ఎంపిడిఒగా సూర్యనారాయణ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం ఎంపిడిఒ(ఎఫ్ఏసి)గా ప్రస్తుత ఇఒపిఆర్‌డి కెవి సూర్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సహకారంతో తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానన్నారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు పని చేసిన ఎంపిడిఒ అరుణకుమారి అనారోగ్య కారణాలతో సెలవు పెట్టారు.

'మధ్యాహ్నం భోజనం' తనిఖీ

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని రాజవరం, బంగారయ్య పేట, శంగవరం పాఠశాలలను ఎంఇఒ ఎస్‌వి నాయుడు సోమవారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించిచ, విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత లోపిస్తే సంబంధిత యాజమాన్యంపై చర్యలు తప్పవని తెలిపారు.

ఆర్‌డిఒ స్పందనకు 8 అర్జీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని గ్రామాల నుండి సమస్యలు పరిష్కారం కోరుతూ 8 అర్జీలు అందాయని ఆర్‌డిఒ జె సీతారామారావు తెలిపారు. ఈ అర్జీలను ఆయా మండలాల అధికారులకు పంపించి వెంటనే సమస్యను పరిష్కరిం చాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కార్యాలయం ఏవో సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి భూ కబ్జాలపై టిడిపి ఆందోళన



పిఠాపురం తహశీల్దార్ తినాధ రావుకి టిడిపి నాయకులతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న వర్మ

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలో వైసీపీ నేతలు చేస్తున్న భూకబ్జాలకు నిరసనగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు సోమవారం ఉదయం పట్టణంలో టిడిపి కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యా లయం వరకూ ర్యాలీగా వెళ్లి బ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ త్రినాథరావుకి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వర్మ మాట్లాడుతూ పట్టణంలో 1, 30 వార్డుల్లో అగ్రహారంలో శ్మశానభూమిని కబ్జా చేసి ప్లాట్లుగా విభజిస్తున్నారన్నారు. వీటిని ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎంఎల్‌శ్రీ పెండెం దొరబాబు ప్రోద్బలంతోనే ఇదంతా జరుగుతోందని, ఈ విషయాలను బయటకు తీసిన ఫాతిమా అనే సచివాలయ ఉద్యోగిపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కలెక్టర్, ఎస్‌పిలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటే ఇక్కడ జరుగుతున్న భూ కబ్జాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్ధమవుతుందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వర్మ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, కొరుప్రోలు శ్రీను, కొండేపూడి ప్రకాష్, సకుమళ్ల గంగాధర్, నల్లా శ్రీను, అందుగుల సత్తిబాబు, సకుమళ్ల నాగబాబు, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను,అయితే రాంబాబు, కోళ్ల బంగారు బాబు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి వేణుగోపాలకృష్ణ

ప్రజా సమస్యలతోనే నిరంతర పోరాటం

ప్రజాశక్తి - కాజులూరు

ప్రజా సమస్యలతోనే నిరంతరం పోరాటం ప్రజాశక్తి పత్రిక చేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ సమాచార శాఖ సినీమాటోగ్రఫీ మంత్రి చెల్లిబోయిన శ్రీనివాస గోపాలకష్ణ అన్నారు. రామచంద్రపురంలోని మంత్రి వేణుగోపాలకృష్ణ స్వగృహంలో సోమవారం ప్రజాశక్తి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకష్ణ మాట్లాడుతూ ఆది నుండి ప్రజాశక్తి ప్రజా సమస్యలపై పోరాడుతూ అనేక ఉద్యమాలు చేసి కార్మిక కర్షక హక్కులను కాపాడిందన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల యేసు రాజు, మంజేరు సహకార సంఘ అధ్యక్షులు గండి కిషోర్, తాడి గనిరెడ్డి, సలాది నానాజీ, యాళ్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్ల ఆస్తిపై బిసి కార్పొరేషన్ డైరెక్టర్ కన్ను

-చర్యలు తీసుకోవాలని స్పందనలో బాధితురాలు ఫిర్యాదు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామంలోని సంతోష్ నగర్‌లోని తన బంధువులకు చెందిన ఒక ఇంటిని కాజేసేందుకు వైసిపి నాయకుడు అదే ఇంట్లో తిష్ట వేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు ఓ మహిళ కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేసింది. ఇంటి ఆవరణంలో ఫ్లెక్స్ పెట్టి తన రాజకీయ అండదండలు, పలుకు బడిని ఉపయోగించి ఇంటి హక్కుదారుల్ని బయటకు దౌర్జన్యంగా గెంటివేసిన వ్యవహారం కలెక్టర్ పంచాయతీకి చేరింది.

ఈ మేరకు కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో సోమవారం బాధితురాలు పిల్లి సీతారాణి ఆధారాలతో కూడిన ఇంటి హక్కు పత్రాలను సమర్పించి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్ దౌర్జన్యాలను కలెక్టర్‌కు వివరించారు. వివరాల్లోకి వెళితే వాకలపూడి సంతోష్ నగర్లోని తన తల్లి పిల్లి విష్ణువేణి పేరు మీద ఉన్న రెండంతస్తుల భవనానికి ఐదుగురు వారసులమని తనకు వచ్చిన వాటా నిమిత్తం పై అంతస్తులో తను నివాసం ఉండేవార మని కలెక్టర్‌కు బాధితురాలు సీతారాణి తెలిపారు. పై అంతస్తుకు తాళాలు వేసుకుని తన అత్త, మామ ఉంటున్న గుంటూరుకు వెళ్లానని, తిరిగి వచ్చేసరికి ఇంటిని బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రభాకర్ ఆక్రమించుకుని ఉన్నాడని నా ఇంటికి నేను వెళ్లిన నేపథ్యం తనపై కుక్కలను వదిలి తనను దౌర్జన్యంగా బయటికి పంపించేశారని బాధితురాలు సీతారాణి కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ పలుకుబడి ఉపయోగించి తన తల్లి పేరు మీద ఉన్న ఇంటి పన్నును వేరొకరి పేరున మార్చివేసి ఆ పన్ను రసీదుతో ఇల్లు నాదంటూ ప్రభాకర్ దౌర్జన్యం చేస్తున్నారని కలెక్టర్‌కు బాధితురాలు ఫిర్యాదు చేసింది. తక్షణం ఇంటి పన్ను రసీదును రద్దుచేసి, సంబంధిత పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు సీతారాణి కలెక్టర్‌కు విన్నవించారు.



కలెక్టర్కు ఫిర్యాదు చేస్తున్న సీతారాణి

ఊరికి ఉపకారి సరంచ్ పుణ్యమంతుల

ప్రజాశక్తి - తాళ్లరేవు:

మండలంలోని జీ.వేమవరం పంచాయతీ సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు తన ఊరికి ఉపకారం చేయాలని చేస్తున్న పలు కార్యక్రమాల్లో భాగంగా పర్యావరణం పైన దృష్టి సారించారు. కడియం నుంచి సుమారు 500 మొక్కలు రప్పించారు. ఒక్కోమొక్క రూ. 30లతో కొనుగోలు చేసి సుమారు రూ.లక్ష యాభై వేలతో 500 కొబ్బరి మొక్కలు కొనుగోలు చేశారు. వాటిని పంచాయతీకి తన వంతు విరాళంగా అందించనున్నట్లు తెలిపారు. వాటిని జీ. వేమవరం పంచాయతీ పరిధిలోని పంచాయతీకి చెందిన స్థలాలు, రహదారుల ఇరువైపులా కొబ్బరి మొక్కలు నాటించాలని నిశ్చయించుకున్నారు. ఈ నెల 8వ తేదీన ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. దశాబ్దాల క్రితం గతంలో పనిచేసిన సర్పంచ్ వీరభద్ర రావు అప్పట్లో 250 మొక్కలను పంచాయతీ స్థలాల్లో వేయించారని ఆ మొక్కల ద్వారా పంచాయతీకి లక్షలాది రూపాయలు ఆదాయం వస్తుందన్నారు. వీరభద్ర రావు చేసిన సేవలు స్ఫూర్తిగా తీసుకొని పంచాయతీకి నాలుగు రెట్లు ఆదాయం సమకూర్చాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దీంతోపాటు పంచాయతీ పాలకవర్గం ఆమోదంతో మరో 500 మొక్కలు కొనుగోలు చేస్తామన్నారు. నాటిన మొక్కలను ప్రజలు బాధ్యత తీసుకుని సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు పంచాయతీ పరిధిలో ఎవరు ఇల్లు నిర్మించుకున్న 50 బస్తాలు సిమెంట్ అందిస్తున్నట్లు ఇప్పటికే సుమారు 200 గహాలకు ఈ సహకారం అందించినట్లు సర్పంచ్ పేర్కొ న్నారు. ఆయనకు చేదోడు వాదోడుగా సర్పంచ్ తమ్ముడు పుణ్యమంతుల సత్తిబాబు సహకరిస్తున్నారు.



నాటడానికి సిద్ధంగా ఉన్న కొబ్బరి మొక్కలతో సర్పంచ్ సూరిబాబు

కార్టూ'నిజం'



మన దగ్గరున్న సొమ్ము
ఆ లెక్కల్లోకి రావు కద్సార్..!!!

కుక్కలు, పందుల నివారణకు తక్షణ చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీ పరిధిలో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు, పందుల నివార ణకు తక్షణమే చర్యలు చేపడు తున్నట్టు మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కష్ణమూర్తి, వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్‌లు స్పష్టంచేశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో కుక్కలు, పందుల నివారణపై పందుల యజమా నులు, పశు సంవర్ధక శాఖ అధికారులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పందుల యజమానులు వారి పందులను పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని గతంలోనే హెచ్చరించిన విషయాలను మరోమారు వారికి గుర్తుకు తెచ్చారు. ఈ నెల 20వ తేదీ తరువాత పందులు వీధుల్లో కనబడితే యజమానులపై చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. కుక్కల విషయానికొస్తే కుక్కల సంఖ్య పెరగ కుండా వాటికి ఆపరేషన్లు నిర్వహించడం యాంటీర్యాబిస్ వ్యాక్సిన్లు వేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని పశుసంవర్ధక శాఖ కాకినాడ జిల్లా సహాయ సంచాలకులు, స్థానిక పశు వైద్యులు చైర్ పర్సన్, వైస్ చైర్మన్ లకు సూచించారు. అయితే అది ఖర్చుతో కూడుకున్న పని అయినందున ఆ ఖర్చంతా పశుసంవర్ధక శాఖ భరించడం సాధ్యం కాదన్నారు. దానికి వైస్ చైర్మన్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ నుంచి ఎంతవరకు సహాయం అందించగలరో నివేదిక అందిస్తే మిగిలిన భారాన్ని స్వచ్ఛంద సంస్థల నుంచి సహాయం తీసుకునేందుకు తాము కృషి చేస్తామన్నారు. పట్టణంలో రోడ్లపై తిష్ట వేస్తున్న పశువుల కారణంగా రాత్రి సమయాల్లో జరిగే ప్రమాదాలపై పలువురు కౌన్సిలర్లు సమావేశంలో లేవనెత్తారు. దానికి సంబంధించి చైర్మన్ వైస్ చైర్మన్ లు మాట్లాడుతూ పశువులను రోడ్లపై వదులుతున్న యజమానులపై గతంలో అపరాధ రుసుములు విధించడం, పశువులను మున్సిపాలిటీ ఆధీనంలోనికి తీసుకోవడం వంటి చర్యలు చేపట్టమన్నారు. మరోసారి వాటిపై కౌన్సిల్ గా తాము చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్టు స్పష్టం చేశారు. సమావేశంలో రెండవ మున్సిపల్ వైస్ చైర్మన్ గోకిన సునేత్రాదేవి, మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, సానిటరీ సూపర్వైజర్ శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాగా సురేష్ కుమార్, జట్ల మోహన్, కో ఆప్షన్ సభ్యులు సల్లూరి కళ్యాణ్, వైసీపీ నాయకులు పి. చంటిబాబు, చిట్టిమాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న చైర్పర్సన్, వైస్ చైర్మన్లు

చేపల మార్కెట్ లో ఇద్దరు వ్యాపారులకు జరిమానా

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు సోమవారం 33 వ డివిజన్లోని చేపల మార్కెట్ ను సందర్శించారు. అక్కడి పారిశుధ్య పనులపై అసంతప్తి వ్యక్తం చేశారు. ఒకటో తేదీ ఆదివారం కార్మికులు విధులకు రాకపోవడంతో చెత్త ఎక్కడికక్కడే పేరుకు పోవడాన్ని గుర్తించి అక్కడి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూచనలు ఇచ్చారు. మార్కెట్‌కు వచ్చే సందర్శకులతో పాటు, వ్యాపారులు కూడా ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో సహకరించాలని కోరారు. ముఖ్యంగా కొందరు వ్యాపారులు చెత్తను రోడ్ల పక్కన వేయడం పై అసహనం వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్ లను వినియోగిస్తున్న, చెత్తను నిర్లక్ష్యంగా రోడ్డు పక్కన వేసిన కారణాలపై ఇద్దరు వ్యాపారులకు రూ.1000 జరిమానా విధించారు. మరోసారి మార్కెట్ సందర్శనకు వచ్చే సమయానికల్లా అక్కడి పరిస్థితి మెరుగుపడాలని, లేని పక్షంలో సంబంధిత పారిశుధ్య కార్యదర్శిచ, మేస్త్రీ లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు వ్యాపారులు సహకరించి నప్పుడే మార్కెట్ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచగలమని ఏడిసి నాగ నరసింహారావు పేర్కొన్నారు. అన్ని వర్గాలు నగరపాలక సంస్థకు సహకరించా లని విజ్ఞప్తి చేశారు.


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా

రైఫిల్ షూటర్స్‌కు కలెక్టర్ అభినందలు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా స్థాయిలో అందుబాటులో ఉన్న క్రీడా మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని షూటింగ్ క్రీడాకారులకు కలెక్టం కృతికా శుక్లా సూచించారు. త్రివేంద్రంలో జరిగిన జాతీయ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ జట్టు ట్రయల్స్‌కు ఎంపికైన డి.అక్షయ, 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ (రాష్ట్ర స్థాయి) రైఫిల్ షూటింగ్ విభాగంలో బంగారు పతకం సాధించిన ఎ.త్రితేజ్, అండర్-17 పిస్టల్ విభాగంలో బంగారు పతకం సాధించిన జి.మౌని ప్రసన్న తదితరులు సోమవారం స్పందన హాల్‌లో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో 'సత్యదేవ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - అన్నవరం



విద్యార్థులను అభినందిస్తున్న ఇఒ మూర్తి

ఇటీవల రాష్ట్రస్థాయి అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆకి క్రీడల్లో అన్నవరం సత్యదేవ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించారు. గత నెల 31 కాకినాడలో జరిగిన ఈ పోటీల్లో కళాశాల విద్యార్థిని వై శిరీష ప్రథమ స్థానం సాధించగా, బి.సంతోష్ కుమార్ బెస్ట్ ప్లేయర్ అవార్డును గెలుచుకున్నారు కళాశాల విద్యార్థి వెంకన్న దొర టైక్వాండోలో ప్రథమ స్థానంలో నిలిచాడు. సోమవారం దేవస్థానం ఇఒ ఎన్‌విఎస్ఎన్ మూర్తి విద్యార్థులను కొండపైన తన కార్యాలయంలో అభినందించారు.

ఘనంగా కౌన్సిలర్ సత్యనారాయణ పుట్టినరోజు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట 4వ వార్డు కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ఆంధ్ర పార్టీ చర్చ్ లో నిర్వహించిన వేడుకల్లో వద్దులు పేదలకు 50 మందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కష్ణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఊబా జాన్ మోసెస్, గోకిన సునేత్రా దేవి, రాష్ట్ర కార్మిక సంఘ అధ్యక్షులు సుబ్బారావులు, కౌన్సిలర్ సత్యనారాయణ దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి, కేకు కోసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం అతిథులు చేతుల మీదుగా వద్దులకు, కార్మికులకు నూతన వస్త్రాలను అందజేసి భోజన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు పాలిక కుసుమ చంటిబాబు, మద్రి శేషారావు, జట్లా మోహన్, పాగా సురేష్ కుమార్, వైసీపీ నాయకులు పాలిక చంటిబాబు, చిట్టి మాని శ్రీనివాసరావు, బాప్టిస్ట్ సంఘ కాపరి రేవ. బి కిరణ్ కుమార్, అధ్యక్షులు బిఎస్ వందనం, రిటైర్ హెచ్ ఎంలు ఐ ఈ జీవన్ కుమార్, జివి రాఘవ పాల్గొన్నారు.


పేదలకు దుస్తులు అందజేస్తున్న సత్యనారాయణ

బాబు సభకు పూర్తి స్థాయి బందోబస్తు ఏదీ?

- మాజీ ఎంఎల్ఎ వర్మ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రాష్ట్ర పోలీస్ వ్యవస్థ జగన్మోహన్ రెడ్డి కనుసన్ననలలో పనిచేస్తోందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు ఇస్తున్న బందోబస్తుపై మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌పిఎఫ్ ప్రొటక్షన్స్ ఉన్న నాయకుడికి మీరు ఇచ్చే బందోబస్త్ ఎలా ఇస్తున్నారు అన్నది ఒక్క సారి పరిశీలిం చుకోవాలన్నారు. ఒక సభ జరుగు తున్నప్పుడు బందోబస్తు ఇవ్వాలని ఆలోచన మీకు ఉందా లేదా? అని పోలీసులను ప్రశ్నించారు. గుంటూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పేదలకు సహాయం చేయాలని నిర్వహించిన మహిళలకు సంక్రాంతి కానుక కార్యక్రమమానికి బందోబస్త్ ఇవ్వాలసిన బాధ్యత పోలీస్ శాఖదేనని, జరిగిన సంఘటన పై పూర్తి బాధ్యత పోలీస్ వ్యవస్థ దేని అన్నారు. అదే సిఎం జగన్ మెహన్ రెడ్డి మీటింగ్ అయితే షాప్‌లు బంద్, ప్రజల నడక బంద్ రోడ్లపై బారిగేట్లు ఇవన్నీ పెట్టి డ్వాక్రా మహిళలతో మీటింగ్ లు పెట్టుకునే పరిస్థితి జగన్ మోహన్ రెడ్డి కి ఉందన్నారు. ఏది ఏమైనా ప్రభుత్వం రాబోయే రోజుల్లో చంద్రబాబునాయుడు సభలను ఆపాలని చూస్తుందని విమర్శించారు. పోలీస్ వ్యవస్థ ప్రజా వ్యవస్థ గాని పార్టీది కాదని ప్రజలు కోసం పనిచేయాలి తప్ప అధికార పార్టీ కోసం కాదని హితవుపలికారు. ప్రతిపక్ష నాయకుడికి బందోబస్త్ ఇవ్వాలసిన బాధ్యత ఉందని, ఇవన్నీ రూల్స్ లో పొందు పరిచిఉన్నాయని తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు నాయుడుని ఆదరిస్తోన్న జన సందోహం చూసి వైసిపి పై ఇంత వ్యతిరేకత ఉందని ఓర్వలేక రాబోయే రోజుల్లో ఇంట్లో కూర్చోవాలి భయంతో ఇపుడు చంద్రబాబు సభలమీద టార్గెట్ చేసి కుట్ర చేస్తున్నారన్నారు.

నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ లో 2023-24 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని నవోదయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి ఒక ప్రకట నలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవ చ్చన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29న జరుగుతుందన్నారు.

4 నుంచి పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం పట్టణ పరిధిలోని 29 వార్డులలో ఉన్న పింఛన్దారులకు ఈ నెల 4 నుండి 7 వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిష నర్ జె.సురేంద్ర సోమవారం తెలిపారు. 4 న పాత పెద్దాపురం, సత్తెమ్మ కాలనీ, మిరపకాయల వీధి,గోలి వారి వీధి-1 సచివాలయాల పరిధి పెన్షనర్లకు, 5న గోలి వారి వీధి-2, కొండయ్య పేట, క్రిస్టియన్ పేట, రామా రావు పేట సచివాలయాల పరిధిలో, 6 న వరహాలయ్య పేట, గౌరీ కోనేరు కాలనీ-1, గౌరీ కోనేరు-2 సచివాలయాల పరిధిలో, 7 న శంకరయ్య పేట, వీరరాజు పేట, నాగమ్మ పేట సచివాలయాల పరిధిలో ఉన్న పింఛన్దారులకు పింఛన్ల పంపిణీ ఉంటుందన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలో 6135 మంది పెన్షనర్లు ఉండగా, ఈ నెల కొత్తగా 173 మందికి పింఛన్లు మంజూరుకాగా మొత్తం 6308 మందికి పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. అలాగే పింఛన్లు తీసుకుంటున్న వారిలో ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి 518 మంది పెన్షనర్లకు పరిశీలన నిమిత్తం నోటీసులు జారీ చేశామన్నారు. పరిశీలన అనంతరం అర్హులైన వారందరికీ పింఛన్ల పంపిణీ యధావిధిగా కొనసాగుతుందన్నారు.

4న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని లింగంపర్తిలో ఈ నెల 4న మెగా వైద్య శిబిరం నిర్వహించ నున్నట్లు జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ వరుపుల తమ్మయ్య బాబు తెలిపారు. కన్యకా పరమేశ్వరి సత్రం ఆవరణలో నిర్వహించే మెగావైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు వైద్య సిబ్బంది అధునాతన వైద్య పరికరాలతో గుండె, బీపీ, షుగర్ కిడ్నీ వ్యాధుల పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయనున్నట్లు తెలిపారు.


ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

దాతలను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - కాజులూరు

దాతల ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కాజు లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ఎస్ శ్రీనివాస్ అన్నారు. సోమ వారం జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ అత్యున్నత ప్రతిభ కనపర్చిన పేద విద్యార్థులకు అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు నగదు పురస్కారం అందించారు. బండారు విజయ, కోన రాణి, నున్న సునీత, క్రరీ దుర్గమ్మలకు రూ.పది వేలు చొప్పున కె.కళ్యాణికి రూ.12000, యాల సంధ్యా రాణికి రూ.18,000 ఉపకార వేతనం అందించారన్నారు. ఉపకార వేతనం అందించిన అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్‌ను ఉద్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.


వికలాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న పవర్‌గ్రిడ్ ప్రతినిధులు

వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ కార్యక్రమం ద్వారా ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆలింకో), కాకినాడ జిల్లా పరిపాలనా యంత్రాంగం సహకారంతో సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో 15 మంది వికలాంగులకు బ్యాటరీతో నడిచే సైకిల్, వినికిడి మిషను మొదలగు ఉపకరణాలను అందజేశారు. కారక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్ రెడ్డి, సీపీవో పి.త్రినాథ్, పవర్ గ్రిడ్ అధికారి ఏఎస్ఎన్. మూర్తి పాల్గొన్నారు.

దుంప చేలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎడిబి రోడ్డులోని శ్రీ రైస్ మిల్లు, పౌల్ట్రీ ఫారం వెనుక ఉన్న దుంపచేలో సుమారు 35 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మతదేహం కనుగొన్నట్లు సీఐ షేక్ అబ్దుల్ నబీ తెలిపారు. 30 నుండి 35 సంవత్సరాల వయసు గల వ్యక్తి మతదేహం ఉబ్బిపోయి ఉందన్నారు. 5.7 అడుగుల ఎత్తు, నీలం రంగు జీన్ ప్యాంటు, ఆర్మీ గ్రీన్ కలర్ రౌండ్ నెక్ టీ షర్టు ధరించి ఉన్నాడన్నారు. పంచనామా అనంతరం మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చేపల చెరువులో విష ప్రయోగం

- రూ.3లక్షల నష్టం

ప్రజాశక్తి-కరప

కరప గ్రామంలో చెరువులో కొందరు దుండగులు విషప్రయోగం చేయడంతో చేపల మృతి చెందాయని ఆక్వా కౌలు రైతు మైలా నాగభూషణం తెలిపారు. నాగభూషణం స్థానిక పల్లపు వీధి రామాలయానికి చెందిన చెరువుని ఇటీవల లీజుకు తీసుకున్నాడు. అప్పులు చేసి ఆ సొమ్ముతో చేపల సీడ్ కొని చెరువులో వేశాడు ఇప్పటివరకు ఒక్క పంట కూడా తీయలేదని, చేపలు ఎదిగి పంట చేతికి వచ్చిన సమయంలో ఈ దుర్మార్గానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశాడు. మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు చెరువులో విషం కలపడంతో చేపలు మృతిచెంది చెరువులో తేలుతున్నాయని, సుమారు రూ.మూడు లక్షల పైనే నష్టపోయానని నాగభూషణం ఆవేదన చెందుతు న్నాడు. చేపలకు ఏదైనా వైరస్ సోకి చనిపోతున్నాయా లేక విషం కలపడం వల్ల చనిపోతున్నాయా అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు బాధితుడు కరప పోలీసులు ఫిర్యాదు చేశాడు.

బోటు వెల్డింగ్ చేస్తుండగా మంటలు

- రూ.10 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జగన్నాధపురం బ్రిడ్జ్ వద్ద ఓలేటి గిరిబాబుకు చెందిన సోనా బోట్ ను బిల్డింగ్ చేస్తుండగా ఇంజన్ దగ్గర నుంచి మంటలు చెలరేగడంతో బోటులో ఉన్న వేట సామగి పూర్తిగా దగ్ధమైంది. వెల్డింగ్ చేస్తుండగా చెలరేగిన మంటల ద్వారా బోటులో ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోయిందని, సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగిందని సాలిపేట అగ్నిమాపక శాఖ అధికారి ఏసుబాబు తెలిపారు. సకాలంలో మంటలను అదుపు చేయడం ద్వారా ఎటువంటి ప్రాణా నష్టం జరగలేదని ఆయన తెలిపారు.

పేకాటాడుతున్న నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-కరప

మండలంలోని వేములవాడ గ్రామ శివారున పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు సోమవారం పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు కరప ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వారి వద్ద నుండి రూ.1520లను స్వాధీనంచేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సారాబట్టీపై దాడి : ఒకరి అరెస్టు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం గ్రామ శివారున సారాబట్టీపై దాడి చేసి రామేశంపేటకు చెందినచ నక్క సత్యనారాయణను అరెస్టు చేసి అతని వద్ద నుండి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపుటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ గణేష్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టుకు పంపినట్లు తెలిపారు.


అంతిమయాత్రలో పాల్గొన్న దృశ్యం

తండ్రికి దహన సంస్కారాలు చేసిన కుమార్తెలు

ప్రజాశక్తి-కాట్రేనికోన

గుండెపోటుతో తండ్రి మృతి చెందగా కుమార్తెలు అన్ని తామై దహన సంస్కారాలు చేశారు. వివరాలు ఇవి.. కాట్రేనికోన మండలం పల్లంకురు శివారు చింతలచెరువుకి చెందిన సాపే అప్పారావు (68) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. వారసుడు లేకపోవడంతో తలకొరివి పెట్టేందుకు కుమార్తెలు ముందుకు వచ్చారు. పెద్ద కుమార్తె స్వర్ణలత తండ్రి అంత్యక్రియలు నిర్వహించింది. నలుగురు కుమార్తెలు నాలుగు కిలోమీటర్లు తండ్రి పాడి వెంట నడిచి శ్మశానానికి చేరుకొని దహన కార్యక్రమాలు నిర్వహించారు.

నేరాలు ఘోరాలు

చిట్టీల పేరుతో రూ.2.36 కోట్లకు టోకరా

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన ఒక మహిళ చిట్టీలు పేరుతో రూ.2.36 కోట్లకు టోకరా పెటిందని బాధితులు తెలిపారు. 95 మంది బాధితులు ఆ మహిళకు లాయర్ నోటీసులు అందించడం ద్వారా విషయం వెలుగులోకి వచ్చింది. డిసెంబర్ 30న బాధితులందరూ హోం మంత్రి తానేటి వనితను కలిశారు. జరిగిన అన్యాయంపై మొరపెట్టుకున్నారు. తమనకు న్యాయం చేయాలని కోరినట్టు తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపడితే మరింత మంది బాధితులు వెలుగులోనికి వచ్చే అవకాశం ఉందని వారు తెలిపారు.


ఘటనా స్థలంలో మృతదేహం

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రావులపాలెం.

ఆర్‌టిసి బస్సు ఢీకొని మతిస్థిమితం లేని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన రావులపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం మతిస్థిమితం లేకుండా ఊరు పేరు తెలియని ఒక వ్యక్తి రావులపాలెం పరిసర ప్రాంతాల్లో దాదాపు ఆరు నెలలుగా బిక్షాటన చేసుకుంటూ తిరుగుతున్నాడు. అయితే అతను రావులపాలెం మండలం రావులపాడు పరిధిలోని జాతీయ రహదారిపై అరటి మార్కెట్ యార్డ్ ఎదురుగా డివైడర్ దిగుతుండగా కొవ్వూరు ఆర్‌టిసి డిపోకు చెందిన బస్సు ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రావులపాలెం పోలీసులు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ లోని అన్నయిపేట మెయిన్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీల్లో మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద గల 28 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. రామచంద్రపురానికి చెందిన పప్పుల శ్రీనివాసరావును అరెస్టు చేసి అతని వద్ద 28 (యానాం) మద్యం సీసాలను వాహనంతో సహా స్వాధీన పర్చుకునీ రామచంద్రపురం కోర్టులో హాజరు పర్చారు. అతనికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ దాడులలో ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ హెచ్‌వి.రామకృష్ణ, ఎస్ఐ ఇ.రవికుమార్. ఎస్.శ్రీనివాస రాజు, మహిళా పోలీస్ బి. లక్ష్మి పాల్గొన్నారు .

హత్యలు లేని దేశాన్ని చూడటమే లక్ష్యం

ప్రజాశక్తి-రాజోలు



స్పందన ఈదా సంస్మరణసభనిర్వహిస్తున్న దృశ్యం

హత్యలు లేని భారతదేశాన్ని చూడటమే మా లక్ష్యమని స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి పివివి.వర ప్రసాద్ అన్నారు. సోమవారం విశ్వేశ్వరాయపురం లో స్పందన ఈదా సంస్మరణ సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారవేత్త డాక్టర్ ఈదా శామ్యూల్ రెడ్డి కుమార్తె స్పందన ఈదా అని అన్నారు. స్పందన ప్రేమించిన యువకుని నుంచి వివాహానికి విముఖత వచ్చింది. దీంతో ఆమె ప్రేమ విఘాతం కలిగిందని భావించి ఈదా స్పందన సరిగ్గా మూడేళ్ల క్రితం జనవరి 2న ఆత్మహత్యకి పాల్పడిందన్నారు. ఒక్కగానొక్క కుమార్తె మరణంతో తండ్రి ఈదా శామ్యూల్ రెడ్డి తన కుమార్తె పేరుతో "స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్" అనే స్వచ్ఛంద సంస్థని స్థాపించారు. ఆత్మహత్యల నివారణపై అనేక పరిశోధనలు కొనసాగించి తన సొంత నిధులతో వివిధ వర్గాలను కలుపుకుంటూ దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 'సైకలాజికల్ రీసెర్చ్ అండ్ వెల్నెస్' అనే పేరుతో మానసిక పరిశోధన కేంద్రాన్ని శామ్యూల్ రెడ్డి త్వరలో స్థాపించబోతున్నారన్నారు. ఈ ఫౌండేషన్ చొరవతో ఆత్మహత్య చేసుకోవాలనుకునే భావనతో ఉన్న సుమారు 300 మంది విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. దీనిని గుర్తించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అనేక సందర్భాలలో ఫౌండేషన్ సేవలను ప్రశంసించాయి.

'జిన్నూరి' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం


జిన్నూరి, కుందెం దంపతులకు సత్కారం

మూడు పర్యాయాలు సర్పంచ్ గా గ్రామాభివృద్ధి చేయడమే కాకుండా రైతు నాయకుడిగా రైతు సంక్షేమానికి పాటుపడిన జిన్నూరి వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. నంగవరం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు కు వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్శిటీ బోర్డు సభ్యునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో సోమవారం గ్రామస్తులు సత్కార సభను నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, వెంకటనారాయణ లక్ష్మి దంపతులను గ్రామస్తులు సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

పిఎంపి వైద్యునికి సత్కారం

అలాగే గ్రామంలో పిఎంపి వైద్యునిగా సేవలందించి అందరి మన్ననలు పొందిన విలసవిల్లికి చెందిన కుందెం భాస్కరరావు, సుభద్రమ్మ దంపతులను కూడా గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజా కుమారి, అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి బాబి, మాజీ సర్పంచ్ లు శీలం సూరిబాబు, చేటకాయల సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.

బంగారం, నగదు చోరీ

ప్రజాశక్తి -ఆత్రేయపురం

ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారం, నగదు చోరీ చేసిన సంఘటన మండలంలోని ర్యాలి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వేణుగోపాల స్వామి వీధిలో ఉంటున్న దెందుకూరి లక్ష్మి సోమవారం ఉదయం 10 గంటలకు ఇంటికి తాళం వేసి వాడపల్లి వెంకటేశ్వర స్వామి గుడికి వెళ్లింది . మధ్యాహ్నం ఒంటిగంటకు ఆమె తిరి గి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తీసి ఉన్నాయి. ఇంటిలోని గదిలోకి వెళ్లి చూసేసరికి బీరువాలో ఉన్న 12 కాసుల బంగారం, రూ.10వేల నగదు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించాలని ఆమె గుర్తించింది. ఆమె ఈ విషయాన్ని పోలీసులు ఫిర్యాదు చేయడంతో సిఐ రజిని కుమార్ సంఘటన స్థలానికి పరిశీలించారు. అమలాపురం నుండి క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిహెచ్.సుధాకర్ తెలిపారు


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అమలాపురంఆర్‌డిఒ వసంతరాయుడు

ఏపి వ్యవసాయ కార్మిక సంఘ ఉద్యమ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 2023 నూతన ఉద్యమ క్యాలెండర్ ను అమలాపురం ఆర్‌డిఒ బి. వసంత రాయుడు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కుడుపూడి రాఘవమ్మ, సఖిలే సూర్యనారాయణ జిల్లా నాయకులు పాము బాలయ్య, బి.మంగాదేవి, భీర వెంకట్రావు, దైవవాణి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి తదితరులు

వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి -మామిడికుదురు

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వర్మి కంపోస్ట్ విక్రయ కేంద్రాన్ని సోమవారం ఎంపిపి కె.వనజ కుమారి ఏర్పాటు చేశారు. జెడ్‌పి సిఇఒ ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని ర్పాటు చేశామని, రైతులకు తక్కువ ధరకు విక్రయిస్తామని ఎమ్‌పిడిఒ కారుపల్లి వెంకటేశ్వర రావు సూచించారు. కార్యక్రమములో ఇఒపిఆర్‌డి శివరామకృష్ణయ్య, సర్పంచ్ కె.ప్రేమ జ్యోతి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మహిళలు

ఇళ్ల స్థలాలు వద్దంటూ నిరసన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఈ ఇళ్ళ స్థలాలు మాకొద్దంటూ నడిపూడి గ్రామానికి చెందిన మహిళలు సోమవారం వారికి కేటాయించిన స్థలాల వద్ద నిరసన తెలిపారు. ఇటీవల ప్రభుత్వం వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు మంజూరు చేసింది. అయితే వారికి కేటాయించిన ఇళ్ల స్థలాలు చూపిస్తామని అధికారులు చెప్పి అల్లవరం మండలం గూడాల గ్రామ పరిధిలో ఊరికి దూరంగా చూపించడంతో మహిళలంతా నిరాకరించారు. ఆ స్థలాలు మా కొద్దంటూ నిరసనకు దిగారు. ఊరికి దూరంగా ఉన్న స్థలాలు మాకు చాలా ఇబ్బందికరంగా ఉంటుందని, వేరొకచోట ఇవ్వాలని మహిళలంతా విజ్ఞప్తిచేశారు.


మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మణరావు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ఆలమూరు

వైసిపి ప్రభుత్వం హయాంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎంపిపి తోరాటి లక్ష్మణరావు అన్నారు. చొప్పెల్ల పంచాయతీ వద్ద సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపనయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి ఎం.శ్యామ్ సుందరం పర్యవేక్షణలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ గ్రామ పరిధిలో పింఛన్ లబ్ధిదారులు 1022 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షుడు వాసన రాజు, గ్రామ సచివాలయ కన్వీనర్లు జాంపోలు మాణిక్యం, గుత్తుల పోసమ్మ, సుంకర కామరాజు, తోరాటి దుర్గారావు, మన్యం వీరబాబు, నరేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న బాధితులు

పిచ్చికుక్క స్వైరవిహారం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువురిపై సోమవారం దాడి చేయడంతో పలువురు గాయాలపాలయ్యారు. పిచ్చికుక్క దాడిలో ఉప్పలగుప్తం పంచాయతీ పేరాయి చెరువు కు చెందిన మట్టా వరప్రసాద్, సత్యనారాయణ, సుభద్ర, సిహెచ్.వాణిశ్రీ, ఎస్.యానాంకు చెందిన చీకట్ల సత్యనారాయణ తోపాటు గ్రామంలో పలువురు పై సోమవారం పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో తీవ్ర గాయాలు పాలైన బాధితులు అమలాపురం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామాల్లో భయభ్రాంతులకు గురి చేస్తూ సంచరిస్తున్న వీధి కుక్కలను నియంత్రించేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు.

కన్నడ తోటలో మళ్లీ డెంగీ విజృంభణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని తోటపేట పంచాయతీ పరిధిలోగల కన్నడ తోట గ్రామంలో డెంగీ మళ్లీ విజృంభించింది. గత నెలలో 15 మంది డెంగీ బారిన పడ్డారు. దీనిపై అధికారులు సరైన చర్యలు చేపట్టకపోవడంతో మళ్లీ ఈ వ్యాధి విజృంభించింది. గ్రామంలో 15 మంది వరకు వివిధ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఒక గ్లోబల్ హాస్పిటల్ లోనే ఐదుగురు డెంగీకి చికిత్స తీసుకుంటున్నట్లు బంధువులు తెలిపారు అపరిశుభ్రత , పారిశుద్ధ్యం లోపించడంతో విష జ్వరాలు విజృభిస్తున్నాయని ప్రజల ఆందోళన చెందుతున్నారు దీనిపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని పారిశుధ్యం మెరుగుపరచాలని గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

పుంత రోడ్డు అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ఏడిద సావరం నుంచి మండపేట పట్టణానికి చేరుకునే ఏడిద సావరం పుంత రోడ్డుకు అభివృద్ధి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సావరం గ్రామ ప్రజలు నేరుగా మండపేట, తాపేశ్వరం తదితర ప్రాంతాలకు చేరుకునేందుకు అనువుగా ఉండే ఈ రోడ్డు 8 ఏళ్ల అధ్వాన్నంగా ఉంది. దీంతో ఆగ్రామల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎఎమ్‌సి, వరల్డ్ బ్యాంకు నిధులు రూ.80 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు మండల జెఇ నాగేశ్వరావు తెలిపారు.


సావరం-మండపేట పుంత రోడ్డు

సమస్యల పరిష్కారానికి కృషి

సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుంది. ఏడిద సావరం నుంచి మండపేట పట్టణానికి చేరుకునే ఏడిద సావరం పుంత రోడ్డుకు రూ. 80 లక్షలతో ఎమ్ఎల్‌సి తోట త్రిమూర్తులు సహాయ సహకారాలతో రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాము. ఈ రోడ్డు అభివృద్ధి చేస్తే పలు గ్రామాల ప్రజలుకు ఇబ్బందులు తీరుతాయి.



-కురుపూడి భవాని, జెడ్‌పిటిసి సభ్యురాలు

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ :
- ఫస్ట్‌ఫ్లోర్, ద్వారకా కాంప్లెక్స్, బస్టాప్ ఎదురు, రావులపాలెం
- ఫస్ట్‌ఫ్లోర్, హనుమాన్ కాంప్లెక్స్, కెఎన్ఎఫ్ మెయిన్‌రోడ్డు, అమలాపురం

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 23.01.2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 842.95 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798